ఒకరోజు ఉదయం శిల్ప గదిలోకి వచ్చిన నానీ "ఆంటీ టిఫిన్ చేద్దాంరా"అంటూ ఆమె దగ్గర మారాం చెయటం మొదలు పెట్టే సరికి ఏంచేయలో ఆమెకు పాలుపోలేదు.

కిరీటి ఇంకా ఆఫీసుకి వెళ్ళలేదని తెలుసు.

అ సమయంలో కిరీటి  కన్యతో సహా డైనింగ్ హాల్లో ఉంటాడని కూడా ఆమెకు తెలియంది కాదు.

ఆమెకు తెలియంది మాత్రం కిరీటి నానీని తన దగ్గరకు పంపాడన్న విషయం.

అందుకే అంకుల్‌తో టిఫిన్ చేయమని ఎంతగానో నచ్చచెప్పింది.

నానీ ససేమిరా వీలుకాదనటంతో సంధిగ్దంలో పడిపోయింది.

కొంతసేపు నిశ్శబ్దంగా ఉండిపోయిన శిల్పకు తళుక్కున ఓ ఆలోచన వచ్చింది నానీని గారం  చేసే కిరీటిని నానీ ద్వారానే సాధించాలని, నానీమీద తనకు ప్రేమేలేదన్న విషయం అతడికి తెలిసేటట్టు చేయాలని మనసు దిటవు చేసుకుంది.

"రా, ఆంటీ" చేయి పట్టుకున్న నానీని విదిలించుకుంది.

"వెళ్ళిక్కడినుంచి.... చెప్తూంటే నీక్కాదూ"కసిరికొట్టడంతో నానీ బిత్తరపోయాడు.

"ఆంటీ..."

నానీ కళ్ళల్లో చిమ్మిన నీళ్ళని చూడగానే ఆమెగుండె తరుక్కుపోయింది.... అయినా తమాయించుకుంది.

"ఫో... ఇక్కడినుంచి...."

దూరంగా నెట్టేయటంతో  వెనక్కి పడ్డ నానీ ఏడుపు లంకించుకున్నాడు.

"చెప్పేది నీకే ..." అంటూ బయటకి చూసింది... కిరీటి వస్తున్న జాడ ఏమీ కనిపించక పోయేసరికి గొంతుస్థాయిని పెంచింది.

"పెద్ద కన్నబిడ్డలాగా ప్రేమలు ఒలకబోస్తున్నాడు... అసలు నువ్వెవరివి... నాకేమైతావని... మళ్ళీ నా గదిలోకి రాకు... వచ్చావంటే మర్యాద దక్కదు..." నిగ్రహించుకుందామని  ఎంత ప్రయత్నించినా  ఆమె కళ్ళల్లోనూ నీరు చిమ్మటంతో వెనక్కి తిరిగి కళ్ళొత్తుకుంది.

"నానీ ...ఏడవకమ్మా...ఇలారా..." కిరీటి కంఠం  వినిపించటంతో  గిరుక్కున వెనక్కి తిరిగింది.

నానీ ఇంకా వెక్కుతూనే వున్నాడు.

"నా  మీద  కోపాన్ని పసిపిల్లాడిపై చూపించటం భావ్యం కాదు" నిట్టూర్చుతూ అన్నాడు.

"ఏం కడుపు తీపి పొంగి పొరలి పోతుందా. ఎవడు రమ్మన్నాడిక్కడికి. నాకేమౌతాడని."

"ఇన్నాళ్ళూ  ఏమౌతాడని చేరదీశావు?"

ఆ ప్రశ్నను  ఊహించలేని శిల్ప కొన్ని క్షణాలపాటు అవాక్కయిపోయింది.

తెల్లబోయిన శిల్ప తెప్పరిల్లాక "ఐ హేట్ యూ " అంటూ తలుపుల్ని ధభేలున

మూసింది.

పరుపుపై బోర్లాపడి మనసు తేలిక పడేంతవరకు ఏడ్చింది.

కిరీటి ఆఫీసుకు వెళ్ళిపోయే వరకూ ఏడుస్తూనే గడిపి తలుపు తట్టిన చప్పుడు కావటంతో వెళ్ళి తలుపు తీసింది.

ఎదురుగా కన్య...

కోపంగా తలుపులు మూయాలనుకుంది .

కానీ ఆప్యాయతను వర్షిస్తున్న ఆమె ప్రసన్న వదనాన్ని చూసి ఆ పని చేయలేకపోయింది.

తనలాంటి మరో మోసపోయిన స్త్రీ... ఈమెనెందుకు ద్వేషించాలి అనుకుంటూ ఆమెకు త్రోవిచ్చింది.

కన్య లోపలికి నడచి సోఫాలో కూర్చుంది.

చాలా సేపటివరకూ నిశ్శబ్దంగా ఉన్నారిద్దరూ.

"కిరీటి ఆఫీసుకెళ్ళాక పగలు గడపటం చాలా ఇబ్బందిగా ఉంటుందనుకుంటాను" యధాలాపంగా అడిగిన కన్య ప్రశ్నకు "పగలే కాదు రాత్రిళ్ళు కూడా" అందామనుకుని ఆగిపోయింది.

"మీది తుంపాలటకదూ"

"అవును, రాజానరేంద్రదేవ్ మనవరాల్ని" అనబోయి ఆగి అవునన్నట్టుగా తలూపింది.

"మా నానీ మీకు బాగా చేరికై పోయాడానుకుంటాను."

దీనికి కూడా అవునన్నట్టుగా తలూపింది కాని జవాబు చెప్పలేదు.

"మీరు బ్రేక్‌ఫాస్ట్ చేయలేదు."

"నాకు తరచగా 'ఫాస్ట్' ఉండటం అలవాటు."

ఏమిటి తిక్క ప్రశ్నలనుకుంటూ దురుసుగా జవాబు చెప్పింది శిల్ప...

అలా మొహం మాడ్చుకుని కూర్చున్న శిల్ప కన్యకు పసిపిల్లలా అనిపించింది.

"మీకు గులాబీ రంగంటే ఇష్టమనుకుంటాను" శిల్ప కట్టుకున్న రోజ్ కలర్ షిఫాన్ శారీని చూస్తూ అంది.

"మరేం.... కానీ రంగులు మార్చటమంటే ఇష్టముండదు" అందామనుకుని ఆగిపోయింది.

"ఆంటీ నీకు ఫోన్ వచ్చింది" నానీ చెప్పటంతో ప్రశ్నల ప్రవాహం నుండి తప్పించుకున్నాను బ్రతుకు జీవుడా అనుకుంటూ బయటకు నడిచింది.

"శిల్పా...." అవతల కిరీటి కంఠమినిపించింది.

"ఆ! నేనే " నీరసంగా జవాబిచ్చింది.

"టిఫిన్ చేశావా ..."

"ఇది అడగటానికేనా పిలిచింది..." సీరియస్‌గా అడిగింది.

"సారీ.... ఇప్పుడేం చేస్తున్నావు?"

"ఫోన్‌లో మీతో మాట్లాడు తున్నాను."

"గూడ్ ...."

"బట్ ఐ ఫీల్ ఇటీజ్ వెరీ బేడ్ " తిక్కగా జవాబిచ్చింది.

"ఎంతైనా రాజా నరేంద్రదేవ్ మనువరాల్ని అనిపించుకున్నావు..."

"చెప్పండి... ఎందుకు పిలిచారో?"

"సాయంకాలం పిక్చరుకు వెళదాం." ఏ కలనుకుందో "అలాగే " అంది.

"థేంక్స్ ఎలాట్ ...."

"దేనికి పిక్చరుకి వస్తానన్నందుకా ?"

"కాదు... అడగ్గానే అంగీకరించినందుకు..."

"మరి ఫోన్ పెట్టేస్తున్నా ?"

"చిన్న రిక్వెస్ట్ ...."

"ఏమిటది.... ?"

"నువ్వు రోజ్ కలర్ శారీ కట్టుకుంటే బాగుంటుంది."

"ఇప్పుడదే కట్టుకున్నా...."

"ఏదీ... కనిపించటం లేదే?"

"ఫోన్‌లో కనిపించదు... వినిపిస్తుంది."

"నేను రిక్వస్ట్ చేసింది సినిమాకి బయలుదేరేటప్పుడు నువ్వారోజ్ కలర్ జర్జెట్ శారీ కట్టుకోవాలని....."

ఫోన్ పెట్టేసింది.

శిల్ప ప్రక్కనుండి ఏమీ రెస్పాన్స్ రాకపోవటంతో కన్య మరికొంత సేపు ఆ గదిలో కూర్చుని వెళ్ళి పోయింది.

సాయంకాలం అయిదున్నరకల్లా కిరీటి కోరినట్టుగా రోజ్ కలర్ శారీని కట్టుకుని రెడీ అయింది.

శిల్పను చూసిన కిరీటి పెదవులు తృప్తిగా విచ్చుకున్నాయి.

బయలుదేరే వేళకి కన్యకూడా కారు దగ్గరకి రావటంతో శిల్పలోని ఉత్సాహమంతా చచ్చిపోయింది.

కన్యను ఒంటరిగా తీసుకు వెళితే బాగుండదని తనను పురికొల్పి ఉంటాడన్న ఆలోచన ఆమెలో మరింత ఉడికించింది.

అందుకే అలిగినట్టుగా వెనక్కి వెళ్ళిపోయింది.

కిరీటి వెళ్ళి ప్రాధేయపడ్డాడు.

"నాకు తలనొప్పిగా ఉంది.... నేను రాలేను." ఉక్రోషంతో జవాబిచ్చింది. అది నిజం కాదని కిరీటికి తెలుసు.

"మన మధ్య దూరం నలుగురుకీ తెలియటం నాకిష్టంలేదు."

"ఆ నలుగురు కోసం మీరు నన్ను సినిమాకి తీసుకెళ్ళటం నాకిష్టంలేదు."

"అవతల కన్య ఏమైనా అనుకుంటుంది."

"రానని చెబుతుంటే మీక్కాదూ" విసురుతో కసురుకునే సరికి చిన్నబుచ్చు కున్నట్టుగా బయటకు బయలు దేరాడు.

కన్యకేం జవాబు చెప్పాలో అర్థం కాలేదు.

అలా అని కన్య ఏమీ ఊహించలేదని కాదు. తను బయలు దేరటం శిల్పకు ఇష్టంలేదన్న విషయాన్ని ఆమె చూపులోనే గ్రహించింది. ముందు తనే రానని చెప్పాలనుకుంది. మళ్ళీ కిరీటి బాధపడాతాడేమోనన్న అనుమానంతో ఊరుకుంది.

"మనం వెళదాం....."

"ఏం ... శిల్ప రాదూ " ఏమీ తెలియనట్టుగా అడిగింది.

"ఆవిడకి తల నొప్పిగా ఉందట" మొహంలోని భావాల్ని కనబడనీయకుండా జాగ్రత్తపడ్డాడు.

"మనమూ మానేద్దాం... తర్వాత వెళ్ళొచ్చు."

ఎలాగైనా ప్రోగ్రామ్ కేన్సిల్ చేయిద్దామని ప్రయత్నించింది. కానీ కిరీటి దానికి సిద్ధంగా లేడు.

ప్రతిచోట తనదే పైచేయిగా ప్రవర్తించే శిల్పకు బుద్ధి చెప్పాలనుకున్నాడు.

అందుకే నానీని వెంట పెట్టుకుని కన్యతో సినిమాకు బయలుదేరాడు.

0 0 0 0 0 0 0 0 0 0 0 0

జెట్ లైట్ సైతం ఆర్పుకుని గదిలో పడుకున్న శిల్పకు సినిమానుండి వాళ్ళు తిరిగి రావటం, డైనింగ్ హాల్లో నానీ మాటలు అన్నీ వినబడుతూనే వున్నాయి.

ఏ రాత్రికైనా కిరీటి తన దగ్గరకు వస్తాడని క్షమార్పణలు చెప్పుకుంటాడాని అనుకుంది.

అర్ధరాత్రి గడిచినా అలాటిదేమీ జరగకపోవటంతో నిద్రకోసం ప్రయత్నించి విఫలురాలైంది.

దూరంగా సముద్రపు హోరు.....

మనసుతోపాటు గదిలో కూడా చిమ్మచీకటి.

నెమ్మదిగా పైకి లేచింది.

భూతంలా ఆక్రమించుకున్న అనుమానాన్ని నివృత్తి చేసుకోవాలన్నట్టుగా తలుపు వారగా తెరచి కిరీటి గదిలోకి చూసింది. పరుపు ఖాళీగా ఉండటంతో ఉండబట్టక వడివడిగా నడుచుకుంటూ కన్య గది దగ్గరకు వెళ్ళింది.

బెడ్ లైట్‌కాంతిలో పరుపుపై నానితో పాటు కన్య నిద్రపోతూ కనిపించారు.

ఎక్కడికి వెళ్ళాడు కిరీటి ....

ఆలోచిస్తూనే అతని పర్సనల్ రూమ్‌ను సమీపించింది.

కిరీటి ఎప్పటిలాగే ఫొటో ఆల్బమ్ చూస్తూ సీరియస్‌గా కూర్చున్నాడు.

ఇదేమిటీ...?

కన్య తిరిగి వచ్చాక కూడా ఇంకా ఫొటో ఆల్బంలో ఏమి చూస్తున్నట్టు..?

అయితే ఇన్నాళ్ళూ అంత శ్రద్ధగా గతాన్ని గుర్తుచేసుకుంటున్నట్టుగా కూర్చునేది

16

ఆరోజు శనివారం కావటంతో అలవాటుగా ఉదయాన్నే అభ్యంగన స్నానంచేసిన శిల్ప తలారబెట్టుకోవటానికి టెర్రస్‌పైకి వెళ్ళి నిలబడింది.

దూరాన ఆకాశాన్ని చుంబిస్తున్నట్టుగా కనిపిస్తున్న సముద్రాన్ని చూస్తుంటే ఆమెకు తన జీవితమే గుర్తుకొచ్చింది.

ఒడ్డును దాటానని ఉవ్వెత్తున పైకిలేచి విరిగి మళ్ళీ వెనక్కి వెళ్ళిపోతున్న కెరటాలు తన అసహాయతను ప్రతిబింబిస్తున్నట్టుగా వున్నాయి.

"శిల్పా!" ఆలోచనలనుండి తేరుకుని వెనక్కిచూసింది.

కిరీటి నిలబడి ఉన్నాడు.

"నేను చెప్పిన విషయం గుర్తుందనుకుంటాను. టైమవుతోంది."

ఆ రోజు ఫ్యాక్టరీ కార్మికులకోసం నిర్మించబడుతున్న కాలనీకి శంఖుస్థాపన ఆమె చేతులమీదుగా జరపాలని కార్మిక సంఘ నాయకులు కోరారని మూడు రోజుల క్రిందటే కిరీటి చెప్పటం ఆమెకు గుర్తుంది.

ఆమె కదలక పోయేసరికి మరోసారి అడిగాడు.

"నేను రానని ఆ వేళే చెప్పాను" స్థిరంగా అంది.

"శిల్పా! ఇలాంటి విషయాలలో మొండి తనం చూపి నన్ను బాధపెట్టకు."

"అక్కడికి నేనేదో చాలా సంతోషంగా ఉన్నట్టు."

"నన్ను సాధించటం నీకు సంతోషకరమైన విషయమేగా ..."

"అవును. మీలో మార్పు రానంత కాలం నా ప్రవర్తన అలాగే ఉంటుంది."

"నా వ్యక్తిగత విషయంలో నీ ప్రవర్తన ఎలా ఉన్నా హర్షిస్తాను. కాని ఇది నా పరపతికి సంబంధించిన సమస్య."

"నేను మీ పరపతిని పెంచే సాధనాన్ని కాలేను."